
సాక్షి
బాపట్ల
బుధవారం । 14 । ఆగస్టు । 2024



పులిచింతల నీటి నిల్వ
అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో నీటి నిల్వ మంగళవారం సాయంత్రానికి 38.94 టీఎంసీలకు చేరింది. దిగువకు 2400 క్యూసెక్కులు వదిలారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 589.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 7,086 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని నాగుల గుడి దేవస్థానంలో నంతాన సుబ్రహ్మణేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

ఎస్‌బీ సీఐ బదిలీ
బాపట్ల టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌బీ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న వి. మల్లికార్జునరావును తెనాలి ఒకటో టౌన్‌కు బదిలీ చేస్తూ మంగళవారం ఐజీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. బాపట్ల డీసీఆర్‌బీ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న బాల మురళీకృష్ణను ఇన్‌చార్జి ఎస్‌బీ సీఐగా నియమించారు.

ఎర్రకోట వేడుకలకు అంగన్‌వాడీ కార్యకర్త ఎంపిక



బల్లికురవ: ఢిల్లీలో జరిగే ఆగస్టు 15 వేడుకలకు మండలంలోని కొత్తమల్లాయపాలెం అంగన్‌వాడీ కార్యకర్త జి.నాగమణి ఎంపికై నట్లు సీడీపీవో దాసరి సుధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయిలో నలుగురు మాత్రమే ఎంపికయ్యారని చెప్పారు. వీరిలో నాగమణి 22 ఏళ్లుగా కార్యకర్తగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అత్యుత్తమ సేవలు అందించినందుకే ఢిల్లీ ఎర్రకోటలో జరిగే వేడుకలకు ఎంపికై నట్లు చెప్పారు. నాగమణిని సూపర్‌వైజర్ ఎ. విజయనిర్మల, పి.సలోమి, కార్యకర్తలు అభినందించారు.

చెత్త నుంచి మరింత సంపద సృష్టించాలి



మేదరమెట్ల: గ్రామంలో సేకరించిన చెత్త నుంచి మరింత సంపదను సృష్టించే ఉత్పత్తులను తయారు చేసుకోవాలని ఏపీ స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఏపీ సిర్డ్) డిప్యూటీ డైరెక్టర్ జె రామనాథం అన్నారు. మంగళవారం కొరిశపాడు మండలం మేదరమెట్ల పంచాయతీ పరిధిలోని చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాన్ని ఆయన పలువురు అధికారులు, సర్పంచ్‌లు, కార్యదర్శులతో కలిసి సందర్శించారు. చెత్త నుంచి తయారు చేస్తున్న సేంద్రియ ఎరువును పరిశీలించారు. కార్యక్రమంలో ట్రెనింగ్ మేనేజర్ అమర్‌బాబు, ఇన్‌చార్జి ఈవోఆర్‌డీ కోటేశ్వరమ్మ, సర్పంచ్‌లు, ఈవో లక్ష్మీకాంత్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

5కే మారథాన్‌లో విద్యార్థినుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ విభాగం, జిల్లా ఎయిడ్స్-క్షయ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన మహిళల 5కే మారథాన్‌లో టీజేపీఎస్ కళాశాల విద్యార్థినులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విజేతలుగా నిలిచినట్లు కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం తెలిపారు. మంగళవారం పట్టాభిపురంలోని కళాశాలలో కేవీ బ్రహ్మంతోపాటు పీజీ, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్.అనితాదేవి, ఏబీపీ మనోహర్ పాల్గొని విద్యార్థినులను అభినందించారు. విజేతలుగా నిలిచిన సి.చేతన, ఎస్‌కే పర్వీన్ రూ.ఏడువేలు, రూ.ఐదువేలు నగదు బహుమతులు సాధించినట్లు వివరించారు. ఈసందర్భంగా కళాశాల అధ్యక్షుడు పోలిశెట్టి శ్యాం సుందర్, వాసవి విద్యానిధి కమిటీ కార్యదర్శి పోలిశెట్టి నాగ సుందరం, ఎన్‌ఎస్ఎస్ జిల్లా అధికారి జేవీ సుధీర్‌కుమార్, ఆర్.జయశైలజ, వ్యాయామ అధ్యాపకుడు ఆర్.శివాజీ విద్యార్థినులను అభినందించారు.

55,002 బస్తాల మిర్చి రాక
కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 55,002 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 52,954 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 18,700 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 15,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. యార్డులో ఇంకా 23,296 బస్తాల మిర్చి నిల్వ ఉంది.

నిమ్మకాయల ధరలు
తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.3,200, గరిష్ట ధర రూ.5,000, మోడల్ ధర రూ.4,200 వరకు పలికింది.

ఉద్యమాల నేల.. ఉప్పెనైన వేళ !

- ఆంగ్లేయులపై పోరులో మంతెనవారిపాలెం ప్రత్యేకత
- రాజకీయ పాఠశాలలో ఎందరో నేతలకు 'స్వతంత్ర' పాఠాలు
- ఆనాటి పాలకులను ముప్పతిప్పలు పెట్టిన ప్రజలు
- జాతిపిత గాంధీ పర్యటించిన ప్రాంతంగా ఎంతో గుర్తింపు



1933లో నిర్వహించిన జాతీయ రాజకీయ పాఠశాలలో శిక్షణ కార్యక్రమానికి హాజరైన నాయకులు

పిట్టలవానిపాలెం: స్వతంత్ర ఉద్యమంలో ఆ గ్రామం చూపిన తెగువ ఈనాటికీ చరిత్రలో ముఖ్య స్థానం పొందింది. ఇక్కడి ప్రజల చైతన్యం నేటి తరాలకు కూడా స్ఫూర్తిగా నిలుస్తోంది. పిట్టలవానిపాలెం మండలంలోని మంతెనవారిపాలెం గ్రామానికి చరిత్ర పుటల్లో ప్రత్యేక స్థానం ఉంది. స్వాతంత్య్ర ఉద్యమ సమయంలో ఉప్పెనలా బ్రిటిష్ పాలకులపై విరుచుకుపడింది. పన్నుల నిరాకరణ ఉద్యమంలో ఈ ప్రాంత ప్రజలు ఆనాటి ఆంగ్లేయ పాలకులను ముప్పుతిప్పలు పెట్టారు. 1922లో మహాత్మాగాంధీ ఇక్కడ పర్యటించిన సందర్భంలో ఆయనకు మంతెనవారిపాలెం ఆతిథ్యమిచ్చింది. గాంధీ హరిజన నిధి సేకరించగా స్థానిక నాయకులతోపాటు మహిళలు సైతం తమకు తోచినవిధంగా డబ్బుతోపాటు బంగారు ఆభరణాలనూ విరాళంగా అందించారు. తద్వారా స్వాతంత్య్ర ఉద్యమంలో తమ భాగస్వామ్యాన్ని చాటుకున్నారు. 1933లో జాతీయ స్థాయిలో రాజకీయ పాఠశాల స్థాపించి దేశ నేతలకు కూడా పాఠాలు నేర్పిందీ నేల. ఉద్యమాల పురిటి గడ్డగా స్వతంత్ర పోరాట చరిత పుటల్లో చెరగని స్థానం సంపాదించింది. ఎందరో ఉద్యమకారులకు సేచ్ఛా సమరంలో శిక్షణ ఇచ్చింది.



గాంధీజీ విశ్రాంతి తీసుకున్న కనుమూరి వెంకటరాజుకు చెందిన గృహం

పోలీసు కాల్పులకు ఎదురొడ్డి..
1942లో క్విట్ ఇండియా మూమెంట్‌లో ఇక్కడి నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసే సమయంలో చాలా మంది లాఠీచార్జి చేసినా బెదరలేదు. పోలీసు కాల్పులకు ఎదురొడ్డి మరీ గాయపడ్డారు. అరెస్టై మరికొందరు జైలుకెళ్లారు. 1933లో ఆల్ ఇండియా రాజకీయ పాఠశాలను మంతెనవారిపాలెంలో నిర్వహించారు. అనేకమంది నాయకులు ఇక్కడ శిక్షణ పొందడానికి అవకాశం కల్పించారు. అప్పటి సోషలిస్ట్, కమ్యూనిస్టు భావాలు కలిగిన కాంగ్రెస్ నాయకులు కూడా ఇక్కడ తీసుకున్నారు. గుంటూరు జిల్లాలో ప్రముఖ నాయకులైన కాసు బ్రహ్మానందరెడ్డి, ఆలపాటి వెంకట్రామయ్య, వెనిగళ్ల సత్యనారాయణ వంటి వారిని రాజకీయ ప్రవేశం చేయించిన ఘనత వెంకటరాజుదే.

మహాత్మాగాంధీ పర్యటన
1929లో గాంధీ ఈ గ్రామానికి వచ్చి హరిజన నిధి పేరుతో బంగారు నగలు, నగదును ప్రజల నుంచి విరాళంగా సేకరించారు. ఇక్కడి వారు విరివిగా తమవంతు విరాళాలు అందించారు. కనుమూరి వెంకటరాజుకు చెందిన ఇంటిలో గాంధీ విశ్రాంతి తీసుకున్నారు. ఆ ఇంటిని నేటికీ గ్రామంలో చూడవచ్చు. ప్రతి సంవత్సరం ఆగస్టు 15వ తేదీన స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడంతోపాటు వీరందరి సేవలను, ఆనాటి సమర ఘట్టాలను ఇక్కడి వారు స్మరించుకుంటారు.

మంతెన.. ప్రత్యేక ముద్ర
ఈ గ్రామంలో జన్మించిన మంతెన వెంకటరాజు స్వాతంత్య్ర స్ఫూర్తికి నడుం బిగించి, ఎంతోమంది యువకులను ఉద్యమం వైపు నడిపించారు. మంతెన వెంకటరాజు తన 17వ ఏటనే చదువుకు స్వస్తి చెప్పారు. 1921లో స్వాతంత్య్ర సమరంలో చురుగ్గా పాల్గొన్నారు. 1930లో ఉప్పు సత్యాగ్రహం ఉద్యమంలో పాల్గొని జైలుకెళ్లారు. 1932లో విదేశీ వస్త్రాలు బహిష్కరించి, కల్లుపాకల వద్ద పికెటింగ్ చేసిన కారణంగా కారాగార జీవితం అనుభవించాల్సి వచ్చింది. 1933లో స్వామి సీతారామ్ అధ్యక్షతన మంతెనవారిపాలెంలో 40 అడుగుల ఎత్తున దిమ్మె నిర్మించి గాంధీ విగ్రహాన్ని మొట్టమొదట స్థాపించారు.



ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన మంతెన వెంకటరాజు విగ్రహం



పట్టణంలో భారీ జాతీయ జెండాతో యాత్ర చేస్తున్న విద్యార్థినులు

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

చీరాలలో 300 అడుగుల పతాకంతో తిరంగా యాత్ర

చీరాల అర్బన్: స్వాతంత్య్ర దినోత్సవం నేపథ్యంలో అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో తిరంగా యాత్రను నిర్వహించారు. స్వతంత్ర వేడుకల స్ఫూర్తిని చాటుతూ విద్యార్థినులు పెద్దసంఖ్యలో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుంటూరు విభాగ్ కన్వీనర్ బి.ప్రసాద్ మాట్లాడుతూ.. దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా తిరంగా యాత్ర చేపట్టామన్నారు. చీరాలలో ఇప్పటికే హర్ ఘర్ తిరంగా యాత్రను నిర్వహించామని పేర్కొన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీకి చెందిన 450 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. 300 అడుగుల జాతీయ జెండాతో పట్టణంలో ఈ యాత్రను నిర్వహించారు. అంతకుముందు కార్యక్రమాన్ని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ స్నేహలత జెండా ఊపి ప్రారంభించారు. 'భారత్ మాతాకీ జై, వందేమాతరం' అంటూ విద్యార్థినులు నినాదాలు చేశారు. మహిళా కాలేజీ నుంచి గడియార స్తంభం వరకు యాత్ర కొనసాగింది. ఆద్యంతం విద్యార్థినులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ దేశభక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర సెక్రటరీ ఎన్.చంద్ర, జాయింట్ సెక్రటరీ రఘు, బీజేపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ తడవర్తి చంద్ర, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాకుమాను సుబ్బారావు, మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ ఎస్.మురళి తదితరులు పాల్గొన్నారు.



బాపట్లలో జెండాను ప్రదర్శనగా తీసుకొస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్స్, విద్యార్థులు

బాపట్లలో 50 అడుగుల పతాకం..

బాపట్ల: పట్టణంలో ఘనంగా తిరంగా యాత్ర పేరిట భారీ ప్రదర్శన నిర్వహించారు. మున్సిపల్ హైస్కూలు వద్ద ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు మంగళవారం ప్రారంభించారు. 50 అడుగుల జాతీయ జెండాను పురవీధుల్లో ఎన్‌సీసీ క్యాడెట్స్, విద్యార్థులు ప్రదర్శించారు. ప్రతి ఒక్కరు తమ ఇళ్లు, కార్యాలయాలు, వాహనాలపై జెండాను ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో లక్ష్య సాధన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

జిల్లా కలెక్టర్ జి.వెంకట మురళి

బాపట్ల : గృహ నిర్మాణాలలో నిర్దేశిత లక్ష్యం చేరుకోవడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. గృహ నిర్మాణాలలో వంద రోజుల ప్రణాళికపై జిల్లా, మండల స్థాయి అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. పక్కా గృహ నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా లబ్ధిదారులలో చైతన్యం తీసుకురావాలని చెప్పారు. నిర్మాణాలకు అవసరమైన వనరులు సమకూర్చుకోవాలన్నారు. సిమెంటు, ఇనుము వంటి సామగ్రి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బాపట్ల జిల్లాలో 50,415 గృహాలు మంజూరు కాగా.. ఇప్పటివరకు 16, 348 నిర్మాణం పూర్తయినట్లు పేర్కొన్నారు. వంద రోజులలో 1,742 ఇళ్లను నిర్మించే లక్ష్యంతో అధికారులు పని చేయాలని ఆదేశించారు. వచ్చే జూన్ లోగా 22,001 నిర్మించేలా కృషి చేయాలని సూచించారు. 6 వేల ఇళ్ల పనుల్లో తర్వాతి దశ పురోగతికి చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులను ఈ దిశంగా చైతన్యపరచాలని కోరారు. ప్రభుత్వం నుంచి రుణాలు మంజూరైనప్పటికీ కొందరు నిర్మాణాలు మొదలుపెట్టకపోవడంపై ఆరా తీశారు. ఇసుక అవసరమైతే కూపన్ ఇవ్వాలని చెప్పారు. మండల, గ్రామ, సచివాలయాల స్థాయిలో సూక్ష్మ ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు సాగాలని కోరారు. నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి సుబ్బారావు, గృహ నిర్మాణశాఖ పీడీ జె.ప్రసాద్, నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులు, ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి ఇంటింటా ఓటర్ల సర్వే

సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా రూపొందించేందుకు ఈ నెల 20 నుంచి అక్టోబరు 18వ తేదీ వరకు ఇంటింటా ఓటర్ల సర్వే ప్రక్రియ చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యదర్శి వివేక్ యాదవ్ నిర్వహించిన వీక్షణ సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశమయ్యారు. అక్టోబరు 19 నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన ఉంటుందని చెప్పారు. 29న సంక్షిప్త ముసాయిదా ఓటర్ల జాబితా రూపొందించాలని పేర్కొన్నారు. సెప్టెంబర్ 29 నుంచి నవంబర్ 28వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించాల్సి ఉంటుందన్నారు. తదుపరి ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డిసెంబర్ 24వ తేదీ లోగా అభ్యంతరాలపై వచ్చిన దరఖాస్తుల పరిశీలన, పరిష్కార కార్యక్రమం చేపట్టాలన్నారు. 2025 జనవరి ఒకటో తేదీలోగా నిబంధనల మేరకు జాబితా సిద్ధం చేయాలని పేర్కొన్నారు. జనవరి 6వ తేదీన సంక్షిప్త సవరణ ఓటర్ల తుది జాబితా ప్రచురించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జేసీ బి.సుబ్బారావు, డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, ఈఆర్‌ఓలు పాల్గొన్నారు.

టీడీపీ నేతల దాష్టీకం

- పెదపరిమిలో వైఎస్సార్ సీపీ కుటుంబాలపై దౌర్జన్యం
- ఇళ్లపై దాడులు.. సామగ్రి ధ్వంసం
- మహిళలపైనా దుర్భాషలు.
- వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం సభ్యుల వద్ద బాధితుల మొర



కావూరి ఫకీరయ్య, నరేష్

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్)/తాడికొండ: టీడీపీ నేతల దాష్టీకాలు ఆగడం లేదు. తాడికొండ నియోజకవర్గం తుళ్ళూరు మండలం పెదపరిమి గ్రామంలోని సుమారు 300కుపైగా వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల కుటుంబాలపై అధికారపార్టీ నాయకులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. నిత్యం చిత్రహింసలకు గురిచేస్తున్నారు. దీనిపై జిల్లా కోర్టులోని వైఎస్సార్ సీపీ లీగల్ విభాగ సభ్యులకు వివరించేందుకు ఆ గ్రామానికి చెందిన కావూరి ఫకీరయ్య, కావూరి నరేష్ మంగళవారం వచ్చారు. వారు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఎన్నికలైన తర్వాత నుంచి టీడీపీ నేతలు తమ నివాసాలపై దాడి చేసి సామాన్లు పగలగొడుతున్నారని, మహిళలను దుర్భాషలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమపై దాడి చేయడమే కాకుండా తిరిగి తమపైనే కేసులు పెడుతున్నారని, ఇళ్లకు పోలీసులను పంపిస్తున్నారని విన్నవించారు. పోలీసులు కూడా టీడీపీ నేతల ఒత్తిళ్లతో తమ ఇళ్లకు వచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ నేతలు కావూరి అశోక్, అనోక్, చందు, నవీన్, వంశీ, దావీదు, పవన్, ప్రసాద్‌తోపాటు మరికొందరు ఈ దాడులు చేయిస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ నేతలు, పోలీసుల వేధింపులు తాళలేక తాము ఊరు వదిలి బయట గ్రామాలకు వెళ్లి తలదాచుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సుమారు 20 కుటుంబాలకు చెందిన వాళ్లు ఊరు వదిలి వెళ్లిపోయారని పేర్కొన్నారు.

ధూమపానానికి యువత దూరంగా ఉండాలి

డీఎంహెచ్ఓ విజయమ్మ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విజయమ్మ తదితరులు

బాపట్ల: ధూమపానానికి యువత దూరంగా ఉండాలని జిల్లా వైద్యాధికారిణి డాక్టరు విజయమ్మ పేర్కొన్నారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టరు విజయమ్మ మాట్లాడుతూ యువత ధూమపానానికి దూరంగా ఉండాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయరాదని ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల హెచ్ఓడీ నిరంజన్, డీఐఓ వెంకటేశ్వర్లు, సౌజన్య, పి.సుజాత, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య స్ఫూర్తి.. భట్టిప్రోలుకు కీర్తి

- ఆంగ్లేయులపై పోరులో చైతన్యం నింపిన ఘనత
- భారీగా విరాళాలతో మద్దుల కుటుంబం సహకారం
- ప్రభుత్వ కార్యాలయాలకూ ఉదారంగా స్థలాలు దానం
- భార్య, పిల్లలను వదిలి ఉద్యమంలోకి బాలకోటయ్య
- జైలులో మగ్గిన యోధుడు మండవ బసవపున్నయ్య

భట్టిప్రోలు: నాడు దేశాన్ని బానిస సంకెళ్ల నుంచి బయటపడేయడానికి ఎందరో త్యాగాలు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో జీవితాలను సైతం లెక్కచేయకుండా ముందుకు దూకి చైతన్యం నింపారు. తమ త్యాగాలతో భావి తరాలకు స్వేచ్ఛావాయువులు పీల్చే అదృష్టాన్ని అందించారు. అలాంటి సమయంలో భట్టిప్రోలు మండలం కూడా స్వాతంత్ర్య ఉద్యమానికి చైతన్యం నింపింది. మహాత్మాగాంధీ 1942లో చెరుకుపల్లి మండలం కావూరు వినయాశ్రయానికి వచ్చి భట్టిప్రోలు చేరుకున్నారు. స్థానిక మారం వెంకటేశ్వర్లు ప్రాథమికోన్నత పాఠశాలలో ఉద్యమకారులతో గాంధీజీ సమావేశం నిర్వహించారు. ఉద్యమానికి బాసటగా నాడు ఎవరికి తోచిన రీతిలో వారు సహకరించారు. ఒంటిపై ఉన్న బంగారం, వెండి ఆభరణాలు, నగదును ఆయనకు అందించారు.

జైలులోనే ప్రసవం

భట్టిప్రోలు నుంచి మద్దుల వెంకటగిరిరావు, ఆయన సతీమణి రామాయమ్మ నేతృత్వంలో 20 మంది ఉద్యమంలో పాల్గొన్నారు. ముందుగా వెంకటగిరిరావు సతీమణి తన ఒంటిపై ఉన్న ఆభరణాలు ఇచ్చారు. ఆ సమయంలో బ్రిటిష్ ప్రభుత్వం ఆ దంపతులను తమిళనాడులోని రాయవెల్లూరు జైలుకు తరలించింది. గర్భవతి అయిన రామాయమ్మ జైలులో సువర్చలా దేవికి జన్మనిచ్చారు. అప్పటి నుంచి భట్టిప్రోలు గ్రామం ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చింది. ఆ దంపతులకు ఐదుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు. వెంకటగిరిరావు 1973లో, రామాయమ్మ 1991లో కన్నుమూశారు. భట్టిప్రోలులో వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా డిగ్రీ కళాశాలను వారసులు ఏర్పాటు చేశారు. మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ నిర్మాణాలకు స్థలాలను ఉదారంగా అందించారు.



మద్దుల వెంకటగిరిరావు, రామాయమ్మ దంపతుల జ్ఞాపకార్థం నెలకొల్పిన డిగ్రీ కళాశాల



మారం వెంకటేశ్వర్లు ప్రాథమికోన్నత పాఠశాల













మద్దుల వెంకటగిరిరావు, రామాయమ్మ దంపతుల (మధ్యలో ఉన్న వారి) కుటుంబసభ్యుల ఫొటోలు (ఫైల్)

కుటుంబాన్ని వదిలి ఉద్యమ బాటలో...



సంగపు బాలకోటయ్య (ఫైల్)

భట్టిప్రోలుకు చెందిన సంగపు బాలకోటయ్య 1942లో ఇక్కడకు వచ్చిన గాంధీజీ ఇచ్చిన ప్రసంగానికి ఆకర్షితులయ్యారు. ఆయన బాటలో పయనించేందుకు నిర్ణయించుకున్నారు. భార్య, ఐదుగురు బిడ్డలను వదిలేసి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. పోలీసుల లాఠీ దెబ్బలు కూడా లెక్కచేయకుండా ముందుకు సాగారు. బ్రిటిష్ ప్రభుత్వం ఆయనకు జీవిత ఖైదు విధించింది. రాజమండ్రి సెంట్రల్ జైలులో కారాగార జీవితం గడిపారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన అనంతరం ఆయన విడుదల అయ్యారు. తరువాత ప్రభుత్వం ఆయనను సమరయోధుడిగా గుర్తించింది. పింఛన్ కూడా అందచేసింది. ఈయన 2006లో కన్నుమూశారు.

■ అలాగే పల్లికోనకు చెందిన మండవ బసవపున్నయ్య కూడా గాంధీజీ స్ఫూర్తితో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. దీంతో ఆంగ్లేయులు ఆయన్ను ఇబ్బందులు పెట్టారు. బళ్లారి జైలులో కారాగార శిక్ష కూడా అనుభవించారు. ఆయన ఐదేళ్ల క్రితం కన్నుమూశారు.

ఆరీఫ్ కుటుంబానికి అండగా ఉంటాం

– మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి



ఖదీర్ బాషాతో మాట్లాడుతున్న ఫరూక్ షిబ్లి

చీరాల: సయ్యద్ ఆరీఫ్ దారుణ హత్యకు గురైన నేపథ్యంలో బాధిత కుటుంబానికి తాము అండగా ఉంటామని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫరూక్ షిబ్లి అన్నారు. మంగళవారం చీరాల మండలం ఈపూరుపాలెంలో ఆరీఫ్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. హంతకులు బెదిరిస్తున్నారని మృతుడి తండ్రి ఖదీర్ బాషా ఆవేదన వ్యక్తం చేశారన్నారు. దీనిపై ఎస్పీకి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా.. భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని ఫరూక్ షిబ్లి తెలిపారు. న్యాయ, మైనార్టీల శాఖ మంత్రి ఫరూక్ ఫోనులో ఖదీర్‌ను పరామర్శించారని చెప్పారు. ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌలానా హుస్సేన్, కార్యదర్శి ఇఫ్తికర్ జామాల్, చీరాల కమిటీ అధ్యక్షుడు అల్లాభక్షు, ఉపాధ్యాయులు ఘని, కార్యదర్శి షౌకత్, ఒంగోలు కమిటీ అధ్యక్షులు నిజాం, సభ్యులు రియాజ్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

కొన్నిసార్లు చూసీచూడనట్లు ఉండాలి!

- ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ
- పలు అక్రమాలు జరిగినట్లు గుర్తించిన ఆడిట్ సిబ్బంది
- అదే సమయంలో డ్వామా పీడీ రాజేష్ వ్యాఖ్యలు
- అక్రమార్కులకు వత్తాసుపై అధికారులు, ప్రజల ఆశ్చర్యం



ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ రాజేష్

వేటపాలెం: ఏ అధికారి అయినా కింది స్థాయి సిబ్బంది అవకతవకలకు పాల్పడుతుంటే హెచ్చరించాలి లేదంటే చర్యలు తీసుకోవాలి. కానీ సాక్షాత్తు జిల్లా అధికారే ఇక్కడ చేసిన వ్యాఖ్యలు అందర్నీ ఆశ్చర్యపరిచాయి. 'కొన్నిసార్లు చూసీచూడనట్లుగా వదిలేయండని' పేర్కొనడం వెనుక ఆంతర్యం ఏమిటో ఆయనకే తెలియాలి. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాల ప్రాంగణంలో ఎన్ఆర్‌జీఎస్ కార్యాలయ వద్ద సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ వేదికలో మండలంలోని తొమ్మిది గ్రామాల పరిధిలో 2023 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు జరిగిన వివిధ పనులపై సోషల్ ఆడిట్ నివేదికలను సిబ్బంది చదివి వినిపించారు. ఈజీఎస్‌సీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ కింద 1,164 పనులు నిర్వహించగా.. వీటికి రూ.7.56 కోట్లు ఖర్చు చేశారు. కూలీలకు రూ. 5.24 కోట్లు వెచ్చించగా, మెటీరియల్‌కు రూ. 2.32 కోట్లు ఖర్చు చేసినట్లు చూపారు. సోషల్ ఆడిట్ సిబ్బంది నిర్వహించిన తనిఖీల్లో అనేక అక్రమాలు బయటపడ్డాయి. సముద్రతీర గ్రామాలైన అక్కాయిపాలెం పంచాయతీ రామాపురం, కఠారివారిపాలెం, పాపాయిపాలెం గ్రామాల పరిధిలోని సముద్ర తీరం వద్ద ఈ పథకం కింద తవ్విన చేపల చెరువుల పనుల్లో భారీగా అవకతవకలు బయటపడ్డాయి. ఈసీ చెక్ మెజర్‌మెంట్‌లు లేకుండా నగదు డ్రా చేశారు. సిమెంట్ కాల్వ పనుల్లో కొలతలు తప్పుగా చూపించి కూడా నగదు తీసుకున్నారు. గ్రావెల్ రోడ్డు వేయకుండా వేసినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. హాజరు పట్టికలో సంతకాలు లేకుండా కూలీలకు నగదు ఇచ్చారు. చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలో రోడ్డు పక్కన మొక్కలు నాటకుండానే నాటినట్లు, వాటికి రోజు నీరు పోస్తున్నట్లు రికార్డుల్లో నమోదు చేసి నిధులు తీసుకున్నట్లు ఆడిట్‌లో తేలింది. అయితే డ్వామా పీడీ సముద్ర తీర ప్రాంతంలో చేపల చెరువుల విషయంలో ఇసుక ప్రాంతం కాబట్టి కొంతమేర పూడిపోయే అవకాశం ఉంటుందని, అందువల్ల సోషల్ ఆడిట్ సిబ్బంది ఈ విషయంలో చూసీచూడనట్లు వ్యవహరించాలన్నారు. దీంతో ఎన్ఆర్‌జీఎస్ అధికారులు, సిబ్బంది, ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారే వారికి అనుకూలంగా మాట్లాడటంపై పలువురు విమర్శిస్తున్నారు. కార్యక్రమంలో హెచ్ఆర్ మేనేజర్ చంద్రశేఖర్, ఎస్ఆర్‌పీ సీహెచ్ చిరంజీవి, ఎంపీడీఓ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా సాగిన హ్యాండ్‌బాల్ పోటీలు



అండర్ -19 విభాగంలో తలపడుతున్న నాగర్ కర్నూల్ -రాయచూర్ బాలుర జట్లు



అండర్ -17 విభాగంలో తలపడుతున్న షిమోగ-విశాఖపట్నం బాలికల జట్లు

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: జవహర్ నవోదయ విద్యాలయాల పరిధిలో నిర్వహిస్తున్న ప్రాంతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు రెండో రోజు రసవత్తరంగా కొనసాగాయి. చిలకలూరిపేట మండలం మద్దిరాల గ్రామంలోని జవహర్ పీఎంశ్రీ నవోదయ విద్యాలయం క్రీడా మైదానంలో సోమవారం నుంచి ప్రారంభమైన ఈ పోటీలకు 4 రాష్ట్రాల్లోని 8 జిల్లాలకు చెందిన జేఎన్‌వీ విద్యాలయాలకు చెందిన 430 క్రీడాకారులు హాజరయ్యారు. తొలిరోజు 12 మ్యాచ్‌లు జరగగా, రెండో రోజు మరో 12 మ్యాచ్‌లను నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు హోరాహోరీగా క్రీడాకారులు తలపడ్డారు. క్రీడల్ని తిలకించేందుకు సమీప గ్రామాలకు చెందిన క్రీడాభిమానులు హాజరయ్యారు. సెమీఫైనల్స్ పోటీల్లో నాగర్ కర్నూల్, రాయచూర్, విశాఖపట్నం, షిమోగ, క్యాలికట్ జేఎన్‌వీ విద్యార్థులు తమ క్రీడా ప్రతిభను చాటారు. బాలురు, బాలికలకు వేర్వేరుగా అండర్ -14, అండర్ -17, అండర్ -19 విభాగాల్లో ఆయా పోటీలను నిర్వహించారు. పోటీలను విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు, పీఈటీ కిషోర్ కుమార్, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. ప్రాంతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు మూడో రోజు బుధవారం కొనసాగనున్నాయి. సెమీస్ పోటీల్లో తమ క్రీడా నైపుణ్యాలను కనపరిచి ఫైనల్స్‌కు చేరిన జట్లకు బుధవారం పోటీలు నిర్వహించనున్నారు. పోటీలు ముగించిన సందర్భంగా సాయంత్రం 4 గంటలకు మద్దిరాల పీఎంశ్రీ నవోదయ విద్యాలయం ప్రాంగణంలో ముగింపు సభను ఏర్పాటు చేయనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తదితరులు పాల్గొంటారన్నారు.

శోకాన్ని దిగమింగి కుమారుడి నేత్రాలు దానం




నాగభైరు శ్రీహర్ష (ఫైల్)

చిలకలూరిపేటటౌన్: తమ కన్నబిడ్డ కళ్లముందే కుప్పకూలి ప్రాణాలు వదలడంతో శోకంతో తల్లడిల్లిన ఆ తల్లిదండ్రులు.. అంతటి విషాదంలోనూ మరొకరికి కంటిచూపును కల్పించేందుకు తమ బిడ్డ కళ్లను దానం చేశారు. చిలకలూరిపేట పట్టణంలోని పండరీపురంలో నివసించే నాగభైరు దుర్గారావు, విజయ దంపతులకు ఇరువురు కుమారులు. దుర్గారావు స్థానిక హెచ్‌పీ గ్యాస్ ఆఫీసులో అకౌంటెంట్‌గా పనిచేస్తుంటాడు. వీరి పెద్ద కుమారుడు నాగభైరు శ్రీహర్ష (23) ఇటీవల డిగ్రీ పూర్తి చేశాడు. ఖాళీగా ఉన్న సమయాల్లో గ్యాస్ ఆఫీసులో తండ్రికి సహాయపడుతూ ఉంటాడు. సోమవారం ఉదయం 8.30 గంటల సమయంలో మిత్రులతో ఫోన్‌లో మాట్లాడిన శ్రీహర్ష ఒక్కసారిగా కుప్ప కూలిపడిపోయాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు గుండెపోటుతో మృతి చెందినట్లు ధృవీకరించారు. తమ కళ్లెదుటే కుమారుడు మృతి చెందటంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తల్లడిల్లారు. కన్నకొడుకు మృతి చెందిన శోకాన్ని దిగమింగి తల్లిదండ్రులు దుర్గారావు, విజయ దంపతులు తమ కుమారుడి రెండు కళ్లను దానం చేశారు. గుంటూరులోని శంకర కంటి ఆసుపత్రి వైద్య బృందం చిలకలూరిపేట పట్టణానికి చేరుకుని శ్రీహర్ష కళ్లను సేకరించారు. శ్రీహర్ష స్నేహితులు, బంధువులు భారీ ఎత్తున చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు.

బాలిక వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

రొంపిచర్ల: మండలంలోని ఓ గ్రామంలో 14 ఏళ్ల మైనర్ బాలిక వివాహాన్ని ఐసీడీఎస్, పోలీసులు కలిసి మంగళవారం నిలుపుదల చేశారు. గ్రామంలోని కస్తూర్బా పాఠశాలలో బాలిక ఎనిమిదో తరగతి చదువుతుంది. ఆ బాలికకు ప్రకాశం జిల్లా యువకుడితో తల్లిదండ్రులు వివాహం చేయాలని నిశ్చయించారు. ఆ బాలికను పాఠశాల నుంచి తీసుకొచ్చి వివాహం ఏర్పాట్లు చేస్తుండగా తెలుసుకున్న అధికారులు అక్కడకు వెళ్లి వివాహాన్ని నిలుపుదల చేయించారు. బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేశారు.

విజయనగరం, గుంటూరు మ్యాచ్ ప్రారంభం



సుమంత్, 8 వికెట్లు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల అండర్-19 బాలుర క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా మంగళవారం విజయనగరం, గుంటూరు జిల్లాల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న విజయనగరం జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 144 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని ఎస్.నివాష్ 64 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. గుంటూరు బౌలర్లు మక్బూనూర్ ఇమ్రాన్, జి.ఆకాష్‌లు చెరో మూడు వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన గుంటూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 128 పరుగులకే కుప్పకూలింది. జట్టులోని జై చందు 52, శ్రీనివాస్ 31 పరుగులు సాధించారు. విజయనగరం బౌలర్ సుమంత్ 11 ఓవర్లు వేసి 28 పరుగులు ఇచ్చి 8 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన విజయనగరం జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 9 పరుగులు సాధించింది. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

దూరవిద్యను ప్రోత్సహించండి

డీఈఓ వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: దూరవిద్యను ప్రోత్సహించటం ద్వారా చదువు మధ్యలో మానివేసిన ఎంతో మందికి విద్యను అందించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. దూరవిద్య ప్రవేశాలను ప్రోత్సహించేందుకు సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో మంగళవారం పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాల ఆడిటోరియంలో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఎంఈఓలు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్, దూరవిద్య స్టడీ సెంటర్స్ నిర్వాహకులు సమావేశానికి హాజరయ్యారు. డీఈఓ మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్లకు రెగ్యులర్ కోర్సు సర్టిఫికెట్లకు ఉన్న గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. దూరవిద్య ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీ, పీజీ ఉన్నత విద్యను అభ్యసించవచ్చని తెలిపారు. ఎంసెట్, టీటీసీ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశం పొంది జీవితంలో ఉన్నతంగా ఎదగవచ్చని వివరించారు. సమావేశంలో ఓపెన్ స్కూల్స్ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎస్.అక్బర్‌అలీ, జిల్లా కోఆర్డినేటర్ కెఎంఏ హుస్సేన్, డిప్యూటీ డీఈఓ కె.వేణుగోపాలరావు, వి.ఏసుబాబు, ఏఎంఓ పి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, పి.చినరామయ్య తదితరులు పాల్గొన్నారు.